తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం · వార్త 30 వార్షికోత్సవం · 1996 - 2026

## తిరుపతి అభివృద్ధిలో ప్రధానమంత్రి చెరిగిపోని ముద్ర



తిరుపతి, సెప్టెంబర్ 17(ప్రభాతవార్త): తిరుపతి అభివృద్ధిలో దేశ ప్రధానమంత్రి పాత్ర కీలకమని టిడిపి, బిజెపి నేతలు ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దీపాలు వెలిగించి ఆయన సేవలకు కృతజ్ఞతలు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్, టిడిపి ఇన్‌ఛార్జి జేబీ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతో మోదీ పదికాలాలు పాటు చల్లగా ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి నేతలు పనబాక లక్ష్మి, నరసింహ యాదవ్, దివాకర్ రెడ్డి, సుగుణమ్మ, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, అన్నా అనిత, పుష్పావతియాదవ్, బిజెపి ఆశీర్వాద దీపోత్సవంలో జిల్లా, నగర, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూషికవాహనంపై అలరించిన పార్వతీపుత్రుడు



కాణిపాకం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాధుడు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన మూషికవాహనంపై కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారికి మూషికవాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె, గ్రామాదుల విశ్వకర్మ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకస్వాములు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారి మూలవిరాట్‌కు వివిధ రకాల పరిమళ సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, అలంకరించి ధూపదీపనైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అర్చకులు అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మరోమారు ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన తనకిష్టమైన మూషికవాహనంపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు నారి కేళ కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# 'ముత్యపు'పందిరినెక్కిన 'మూడునామాల' దేవుడు



తిరుమల, సెప్టెంబర్ 17(ప్రభాతవార్తప్రతినిధి): మూడునామాల శ్రీవేంకటేశ్వరుడు వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి విశేషఅలంకరణలో ముత్యపుపందిరిపై ఊరేగారు. రాత్రి 7గంటలకు వాహనమండపంవద్ద ముత్యపుపందిరిపై వేంచేపుచేశారు. ఇక్కడ అర్చకులు వేదఘోష్టితో కర్పూరహారతులిచ్చారు. అనంతరం స్వామివారి వాహనం బయలుదేరి ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ముత్యాలు విలువైనవి. చల్లదనాన్ని ప్రసాదిస్తాయి. తెల్లనికాంతులీనుతుంటాయి. స్వాతికార్తెలో వానచినుకు సాగరంలోని ముత్యపుచిప్పలో పడి మనోజ్ఞమైన ముత్యంగా రూపొందుతుంది. ఇంత ప్రశస్త్యమైన ముత్యాలను పందిరిగా చేసుకుని ఏడుకొండలస్వామి మురుపుగొల్పుతూ ముచ్చటగా ఊరేగాడు. భక్తులు అడుగుడునా కర్పూరహారతులిచ్చారు. ఏడుకొండలవాడా గోవిందా అంటూ నామస్మరణలుచేశారు. చల్లనిముత్యాలక్రిందనిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూరుస్తుందని విశ్వాసం. ఈవాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, రాష్ట్రగవర్నర్ అబ్దుల్‌నజీర్, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి దంపతులు, సివిఎస్ఓ మురళీకృష్ణ జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఇఓ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేపే గరుడసేవ !

**-నేటి రాత్రి నుండి ఘాట్‌లో ద్విచక్రవాహనాలు నిషేధం**
**-అలిపిరిలోనే వాహనాల పార్కింగ్**




ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: పవిత్రమైన పెరటాసిమాసంతోబాటు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రికి (రేపు)గరుడసేవ రావడంతో తిరుమలకు పెద్దసంఖ్యలో భక్తులు చేరుకుంటారని టిటిడి భావిస్తోంది. ఈ నేపథ్యంలోఇందుకు తగ్గట్లు టిటిడి పాలక మండలి, అధికారులు కూడా ముందస్తు ఏర్పాట్లు, చర్యలు తీసుకుంటున్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ శనివారం రాత్రి జరగనుండటం, శ్రీవారికి శనివారం ప్రీతికరమైన రోజు కావడంతో మరింత విశేషముంది. ఈ ఏడాది గరుడసేవ రాత్రి 6.30గంటలకే ప్రారంభమవుతుంది. గరుడసేవను దృష్టిలో వుంచుకుని సామాన్యభక్తులకు స్వామివారి దర్శనం కల్పించడంతోబాటు గరుడసేవను వీక్షించేలా కొండంతా ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేశారు. భక్తుల సౌకర్యాలు, ఏర్పాట్లపై స్వయంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీకృష్ణ బలగాలు భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. గరుడసేవ సందర్భంగా శుక్రవారం రాత్రి నుండి ఆదివారం ఉదయం 7గంటల వరకు తిరుమల-తిరుపతి. తిరుపతి-తిరుమల మధ్య ద్విచక్రవాహనాలను పూర్తిగా నిషేధించారు. 24గంటలూ ఘాట్ రోడ్లను తెరచివుంచి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఎప్పటిలాగే భక్తులకు తిరుపతిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. తిరుమలకు చేరుకునే వాహనాల సంఖ్యను బట్టి 10వేలకు మించితే వాహనాలను అలిపిరిలోనే పార్కింగ్ చేయిస్తారు. ఆలయ మాఢవీధుల్లో భక్తులకు గరుడసేవరోజు అన్నిరకాల ఏర్పాట్లు, అదనపు మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.

## కార్యాలయాల చుట్టూ ఎస్సీ, ఎస్టీలకు ప్రదిక్షిణలు చేయించుకుంటే కఠిన చర్యలు

**జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు.**



చిత్తూరు, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:
ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించకుండా వారిని కార్యాలయాల చుట్టూ ప్రదిక్షిణలు చేయించుకుంటే అలాంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన 3వ త్రైమాసిక జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ దగ్గుమళ్ళ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించి, అర్హత మేరకు తక్షణ పరిష్కారం చూపడంతో పాటు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలని, సమస్యలు పరిష్కరించకుండా వారిని కార్యాలయాల చుట్టూ తిప్పడం, వారి పట్ల చులకన, లేదా దురుసుగా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే సహించబోమన్నారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలపై అధికారులు సత్వరం స్పందించి పరిష్కరించగల అంశాలను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, హౌసింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఎస్ఆర్ పురంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీలను గుర్తించి వారికి ఇళ్ళ పట్టాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన స్మశాన వాటికలకు స్థలాలు, రహదారి సౌకర్యం వంటి సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, విచారణ, తదుపరి ప్రక్రియలను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## మొగిలి ఘాట్ వద్ద ఘోర ప్రమాదం

**- ఇద్దరు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు**





ప్రమాదంలో మృతి చెందిన కాంచన ఉమాపతిరాజు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:
తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా కొప్పేచిపాడు గ్రామంకు చెందిన ఇద్దరు భక్తులు బంగారుపాళ్యం మండల పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెంది తిరిగిరాని లోకాలకు చేరారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద గురువారం ఉదయం ఈ ఘోర ప్రమాదం జరిగింది. మొగలిఘాట్‌లో మరమ్మత్తులకు గురై రహదారి ప్రక్కన నిలిచివున్న లారీని వెనుకవైపు నుండి వేగంగా బొలొరో కారు వచ్చి ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా కొప్పేచిపాడు గ్రామంకు చెందిన కాంచన(38), ఉమాపతిరాజు(35)లు మృతి చెందారు. అలాగే ఈ ప్రమాదంలో గణపతి, నిత్య, పాండ్యన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా వున్నాయి. తమిళనాడు రాష్ట్రం క్రిష్టగిరి జిల్లా కొప్పేచిపాడు గ్రామంకు చెందిన గణపతి, పాండ్యన్ కుటుంబ సభ్యులు బుధవారం తమ సొంత కారులో తిరుమలేశుని దర్శనానికి బయలుదేరి వచ్చారు. బుధవారం రాత్రి స్వామి వారిని దర్శించుకున్న అనంతరం గురువారం తెల్లవారుజాము తిరిగి తమ స్వగ్రామంకు వీరు కారులో బయలుదేరారు. బంగారుపాళ్యం మండలం మొగలిఘాట్ వద్ద ఆగి వున్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు వెనుకవైపు నుండి అతివేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో కారు డ్రైవర్ ప్రక్కన కూర్చొని వున్న కాంచన అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక సీటులో కూర్చొని వున్న ఉమాపతిరాజు, గణపతి, డ్రైవర్ పాండ్యన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉమాపతి రాజు మృతి చెందాడు. మృతదేహాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తిశ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెదేపా సునామీని వైఎస్సార్సీనేతలు తట్టుకోలేరు..

**- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**




కుప్పం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త
కుప్పంలో మున్సిపల్, ఎంపిటిసి, జడ్పీటీసి, పంచాయతీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసి సిఎం చంద్రబాబునాయుడుకు కానుకగా అందిస్తామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో తెలుగుదేశం పార్టీ సునామీని వైకాపా నేతలు తట్టుకోలేరని పేర్కొన్నారు. కుప్పంలో వైఎస్సార్సీ నేతలల లెక్కలు సరిచేస్తామన్నారు. సిఎం చంద్రబాబు కుటుంబం గురించి అవాచుకులు చెవాకులు పేలితే వీపు విమానం మోతేనని హెచ్చరించారు. వైఎస్సార్సీ పాలనలో అప్పటిప్రతిపక్ష నేత సిఎం చంద్రబాబును ఎమ్మెల్సీ భరత్ అధ్వర్యంలో అడ్డుకున్నారని అయితే తాము అధికారంలో వచ్చినా వైకాపా నేతలు తిరుగుతున్నార ంటే అది సిఎం చంద్రబాబుకు ఉన్న సంస్కారం అన్నారు. ఎమ్మెల్సీ భరత్ వైకాపా శ్రేణులను సింహాలతో పోల్చుకుంటున్నారని ఆయన అమూల్ బేబీ అని వ్యాఖ్యానించారు. కుప్పంలో రక్తాభిషేకం చేస్తామన్న భరత్‌కు వైకాపా నేతలకు రక్తం ఎక్కువగా ఉంటే కుప్పం ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేయాలని పేర్కొన్నారు. కుప్పంలో చంపే అవసరం చచ్చే అవసరం ఎందుకని ప్రశ్నించారు. కుప్పంలో పెద్దిరెడ్డిని చూసి భయపడేవారు ఎవరూ లేరన్నారు. తెదేపా ప్రతిపక్షంలో ఉన్నపుడే తాను పెద్దిరెడ్డికి సవాల్ విసిరిన విషయం గుర్తు చేశారు. సిఎం సతీమణి నారా భువనేశ్వరి కుప్పం ప్రజలపై ఉన్న ప్రేమాభిమానాలతో కుప్పం వచ్చి ట్రస్ట్ ద్వారా కార్యక్రమాలు చేపడుతుంటే వైఎస్సార్సీ నేతలు విమర్శించడం దారుణమన్నారు. కుప్పంలో కూటమి విజయమే అజెండా అన్నారు. కుప్పం గడ్డ చంద్రబాబు అడ్డా అని నిరూపిస్తామన్నారు. సమావేశంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, రాజగోపాల్, మాజీ సర్పంచులు గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కుప్పం గ్రామదేవత శ్రీతిరుపతి గ ంగమ్మ ఆలయం వద్దకు చేరుకోగా నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు.

## అన్యమత వివాహానికి వేదికగా శ్రీనాగేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ మండపం

సూళ్ళూరుపేట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:
సూళ్ళూరుపేటలోని శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న కళ్యాణ మండపం అన్య మత వివాహానికి గురువారం వేదికగా మారింది. ఉదయం కల్యాణ మండపంలో క్రిస్టియన్ మతానికి సంబంధించి ప్రార్ధనలు దానితో పాటు వివహా తతంగం జరుగుతుండాన్ని చుట్టుప్రక్కల వారితోబాటు దేవస్థానానికి వచ్చిన భక్తులు గమనించారు. తక్షణమే ఈ విషయాన్ని దేవస్థానం ఛైర్మెన్ తాటిపర్తి ఆదినారాయణారెడ్డికి సమాచారం అందించారు. ఆదినారాయణ రెడ్డి దేవస్థానానికి చేరుకుని అక్కడ వివాహ నిర్వాహకులతో మీకు ఎవరు పర్మిషన్ ఇచ్చారంటూ వాగ్వివాదానికిదిగారు. మాజీ ట్రస్ట్ బోర్డు నెంబర్ సిఫారసుతో దేవస్థానం కార్యనిర్వాహనాధికారి కళ్యాణ మండపాన్ని ఇచ్చారని తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే వివాహ నిర్వాహకులు అక్కడ నుంచి వెళ్ళిపోతూ దేవస్థానం ముందు కట్టిన ఫ్లెక్సీలను కూడా తొలగించి వేశారు. ఒకవైపు హిందూ ధర్మాన్ని పాటిస్తూ పాలన చేస్తున్న బిజెపికి చెందిన ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ ఇక్కడ ప్రస్తుతం ఉన్నాడు. అటువంటి ఈ దేవస్థానంలోని ఈ చర్యలు జరగడం పట్ల పలువురు భక్తులు విస్మయం రక్తం చేస్తున్నారు. ఈ విషయమై దేవస్థానం ఈవో మమత వివరణ ఇస్తూ తమకు ఇందు ధర్మం ప్రకారమే వివాహం చేసుకుంటామని చెప్పి కళ్యాణ మండపాన్ని తీసుకున్నారని, అలాగే తాళిబొట్టును కూడా శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంలోని శివయ్య స్వామి ముందు ఉంచి పూజలు చేసుకున్నారని తర్వాత ఈ చర్యలకు పాల్పడినట్లు తనకు తెలిసిందని చెప్పారు.

## అప్పు వివాదం...

**- మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం..**



వరదయ్యపాలెం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :
ఇచ్చిన అప్పును వసూలు చేసుకునేందుకు సంవత్సరాల తరబడి తిరిగి తిరిగి విసిగివేసారిన ఓ యువతి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వరదయ్యపాలెంలో గురువారం వెలుగు చూసింది. బాధితురాలు కథనం మేరకు మండలంలోని సియల్ఎన్ పల్లె కు చెందిన మోనిక, ప్రవీణ్ దంపతులు వరదయ్యపాలెం ప్రకాశం వీధిలో నివాసం ఉంటున్నారు. కొన్నాళ్ల కిందట పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ (బీసీ కాలనీ బలిజపాలెం) సమీపంలో గల రియల్ ఎస్టేట్ భూమి విషయంలో స్థానికంగా ఉన్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి, స్థానిక రాజకీయ నాయకుడుకి మోనిక ప్రవీణ్ దంపతులు రూ.40 లక్షలు రుణంగా ఇచ్చారు. అయితే ఆ భూమి విషయమై వివాదం ఏర్పడటంతో రుణం చెల్లించకపోవడంతో తమ వద్ద తీసుకున్న రుణం ఇవ్వాలని పలుమార్లు వ్యాపారిను కోరారు. అప్పు కోసం ఇంటిచుట్టూ ప్రదక్షనులు చేస్తున్నా, అదిగో ఇదిగో అంటూ రాజకీయ, అధికార బలంతో కాలయాపన చేస్తున్నాడనీ బాధితురాలు తెలిపింది. దీనిపై గతంలో పోలీస్ స్టేషన్లో సైతం మధ్యస్థం చేశారని, అయితే చెప్పిన గడువు ముగిసిన తర్వాత కూడా ఇవ్వకపోవడంతో మరో గత్యంతరం లేక విసిగి మనస్తాపంతో గురువారం ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డింది. దీంతో కుటుంబ సభ్యులు గుర్తించి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

## తిరుపతి జిల్లాలో 4 లక్షల కేసులకు 3.77 లక్షల కేసులు పూర్తి.. కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:
ప్రత్యేక విస్తృత పునర్విమర్శ (సర్-2026) కార్యక్రమం అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం సచివాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షి ంచారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్ 2026 లో భాగంగా కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా పునర్విమర్శ, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పరిశీలన, నోటీసులు, దరఖాస్తుల పరిష్కారం, విచారణలు తదితర అంశాలపై జిల్లా వారీగా పురోగతిని సమీక్షి ంచి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు లతో కలసి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ సర్ 2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిర్దేశిత కాలపరిమితికి అనుగుణంగా సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దరఖాస్తులు, విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తూ ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షి ంచాలని సూచించారు.

## అభివృద్ధికి నిధుల కోసం ఆరా తీస్తే...

# అక్రమాలు బయటపడ్డాయి!



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో పాలకులు అభివృద్ధికి సంబంధించి నిధులపై ఆరా తీయగా అక్రమాలు, అవినీతి, అవకతవకలు బయటపడ్డాయి. అయితే ఇక్కడ అవకతవకలు, అవినీతి బయట పడకుండా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ శతవిధాల ప్రయత్నించారు. తనకేమి సంబంధం లేదన్నట్లు చిరుద్యోగులు నుంచి రూ.22 లక్షలు వసూలు చేసారు. చిరుద్యోగులు అవకతవకలకు పాల్పడి ఉంటే తనకు తెలిసినపుడు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సింది పోయి పంచాయతీలు జరిపటం ఏమిటని పట్టణం లో చర్చించుకుంటున్నారు. అయితే రికార్డుగా సొమ్ములు తమ బంధువుల పేర బదిలి చేసుకున్న చిరుద్యోగులు బలి అయ్యారు. మరి ఆ డ్రా చేసిన సొమ్ములు అనధికారికంగా తీసుకున్న వారెవరో తెలియాలి కదా? అని జనం చర్చించుకుంటున్నారు. పై అధికారుల అండ దండలు లేనిదే చిరుద్యోగులు ఇంత సాహసం చేస్తారా? అనేది ఉన్నతాధికా రులు సమగ్ర విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**అధికార పార్టీ విచారణతోనే అవకతవకలు బయటపడ్డాయి.!**

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆసుపత్రిలో పారదర్శకతతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అనుభవం ఉన్న ఓ సీనియర్ డాక్టర్‌కు నియోజకవర్గ నాయకుడు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ మెటర్నిటి సెలవులో వెళ్ళటంతో ఇక్కడ మరో కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించారు. ఆమె 20రోజుల ఆసుపత్రిలో అభివృద్ధికి సంబంధించి నిధులేమున్నాయని ఆరా తీసిన డాక్టర్‌కు కంప్యూటర్ ఆపరేటర్ జరిగిన తప్పిదాలను వివరించినట్లు చర్చ జరుగుతుంది. ఈ విషయం తెలుసుకున్నఆఫీసర్లు విషయం బయట పడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ నిధులను ఎంచక్కా ఆపరేటర్లుచందు, లక్ష్మీ ప్రసన్న తమ బంధుల పేరుతో డ్రా చేసినట్లు తేటతెల్లమైంది. దాంతో ఈ సంఘటన బయటకు పొక్కకుండా ఆసుపత్రి అధికారి పంచాయతీలు జరిపినట్లు సమాచారం. చిరుద్యోగులు అవకతవకలకు పాల్పడితే అధికారి వెంటనే విచారణకు ఆదేశించాలి. కానీ ఎందుకు పంచాయతీ జరిపి వారి నుంచి సొమ్ములు రాబట్టారో ముక్కంటీశునికూడా అంతు పట్టదు.

**ఆరోగ్యశ్రీ నిధులు కథా కమామిషు ఏమిటి?**

ఆరోగ్య శ్రీ పథకంలో నిధులను ప్రభుత్వం సంబంధిత ఆసుపత్రికి అందిస్తుంది. ఇందులో 40 శాతం ఆసుపత్రికి మిగిలిన 60శాతం సేవలందించిన డాక్టర్లు, ఇతర సిబ్బందికి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు తామాషా ప్రకారం అందించాలి. అయితే శ్రీకాళహస్తి ఆసుపత్రిలో 40శాతం నిధులు దుర్వినియోగం కాగా మిగిలిన సేవలందించిన వారిలో డాక్టర్లు మాత్రం లక్షలు సర్దుబాటు చేసుకున్నారు. ఇతర సిబ్బందిలో కొందరు స్టాఫ్ నర్సులకు అందించారు తప్ప మిగిలిన వారికి ఇవ్వలేదని తెలిసింది. ఏదీ ఏమైనా నిబంధనలకు వ్యతిరేకంగా నిధులు డ్రా చేసారన్నది రికార్డుగా ఉంది. అలాంటప్పుడు చట్టం గురించినిత్యం వల్లించే ఆసుపత్రి సూపరింటెండెంట్ పంచాయతీలు ఎందుకు చేయాల్సి వచ్చింది? ఎవరిని తప్పించుటకు? అనేది చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారులు రాజకీయ వత్తిడులకు లొంగకుండా విచారణ జరిపితే స్టేషనరి కుంభకోణంతో పాటు ఆసుపత్రిలో జరుగుతున్న పలు అవకతవకలు బహిర్గతమౌతాయని ప్రజలు చెబుతున్నారు.

## ఘనంగా ప్రధాని మోడి జన్మదినం



**పెనుమూరు, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడి జన్మదినంను పురస్కరించుకుని గురువారం మండల పరిధిలో బిజెపి నాయకులు పలు సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మండల బిజెపి అధ్యక్షు లు గుత్తా వాసుదేవనాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. గుద్యానంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించి విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రధాని నరేంద్రమోడి ఆరోగ్యంగా వుండాలంటూ 77 దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ప్రాణం అమూల్యం



**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** వైద్యులకు ప్రతి ప్రాణం అమూల్యమని, రోగి భద్రతే వైద్యుల ధర్మం అని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ క్రిటికల్ కేర్ ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రవి పి.మహజన్ అన్నారు. అపోలో నాలెడ్జ్ సిటీలో గురువారం వరల్డ్ పేషెంట్ సేఫ్టీ డేను ఘనంగా నిర్వహించారు. ది అపోలో యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(ఎఐఎంఎస్ఆర్), అపోలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నగర్కార్ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో రోగి భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం వుందన్నారు. ఆసుపత్రుల్లో చిన్నపాటి పొరబాట్లు కూడా ప్రాణాపాయ పరిస్థితులకు దారి తీయవచ్చునని, అందువల్ల వైద్యులు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది అత్యంత జాగ్రత్తగా సేవలు అందించాల్సిన బాధ్యత వుందన్నారు. డాక్టర్ వినోద్‌భట్ మాట్లాడుతూ ఆరోగ్య సేవల్లో నాణ్యతను పెంపొందించడంలో పేషెంట్ సేఫ్టీ కీలకమని పేర్కొన్నారు. ప్రతి రోగిని కేంద్రంగా వుంచుకుని సేవలు అందించడం అవసరమన్నారు. అనంతరం నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, నర్సింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు, అధ్యాపకులు, ఆరోగ్య నిపుణులు పాల్గొన్నారు.

## రైతులకు మొక్కజొన్న విత్తనాలు పంపిణీ



**రామకుప్పం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో రైతులకు మొక్కజొన్న విత్తనాలను క్లస్టర్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఐదు కిలోల మొక్కజొన్నలు రాయితీతో తొంభై రూపాయలు, పశుగ్రాసం ఇరవై కిలోలు 360రూ.లకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందప్ప, మురళి, పవన్, మనోహర్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ప్రణాళిక తయారీపై సమావేశం

**రామకుప్పం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త**

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళిక తయారీపై శుక్రవారం మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అశ్విని తెలిపారు. సంబంధిత కార్యదర్శులు తప్పక హాజరు కావాలన్నారు.

## జగన్ పథకాలకు రంగులు మార్చారు



**బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలకు రంగులు మార్చారని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. గురువారం స్థానిక రాయల్ మహల్‌లో జరిగిన మండల వైకాపా నేతలు, కార్యకర్తల సమావేశంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు వైకాపా హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉంటూ పార్టీ సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంపిపి రెడ్డెప్ప, జడ్పీటిసి కేశవులు, నేతలు శ్రీనివాసులురెడ్డి, దయానందగౌడు, జయకుమార్, నారాయణస్వామి, రాజు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

– మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



**పెద్దపంజాణి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ కోరారు. గురువారం మండల వైకాపా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అధికారులు ఎన్నికల సమయంలో ఒత్తిళ్లకు తలొగ్గక నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. పార్టీలో కష్టకాలంలో పనిచేసిన నేతలు, కార్యకర్తలను పార్టీ మరువదన్నారు. నేతలు, కార్యకర్తలు విబేధాలు పక్కనపెట్టి ఐకమత్యంతో పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను అధికారంలో వచ్చాక అమలు చేయడం లేదన్నారు. వైఎస్ జగన్ పాలనలో ప్రజలకు సంక్షేమం అందించామన్నారు. నేడు కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించి ఒదన్నారు. మూడువేల నిరుద్యోగ భృతి ఎ ంతమందికి ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ ముఖ్యనేతలు,ఎంపిటిసిలు,మాజీ సర్పంచులు, వివిధ హోదాల్లో ఉన్న నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యమే దేశ ప్రగతికి పునాది



**పుల్లంపేట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్థానిక వైద్య అదికారులు సానే శేఖర్, అశ్విని చంద్ర, ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్, ప్రజల ఆరోగ్యమే దేశ ప్రగతికి పునాది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల వ్యాధులపై వైద్య సేవలను అందించడం వంటి కార్యక్రమాలను చేయడం, ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, సాధారణ అంటు వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో అవసరం ఉందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు మహేశ్వరమ్మ, శివగౌరీ, సుబ్బారెడ్డి, మహేష్, స్టాఫ్ నర్సులు ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు

## సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి ఇంచార్జ్ ముక్కారూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్లు



**ఓబులవారిపల్లి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమానికి రావడంతో కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానందరెడ్డి, రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధరు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రైల్వే కోడూరు లోని పలు సమస్యలను వివరించారు. అన్ని విధాల రైల్వే కూడ అభివృద్ధికి సహకరిస్తున్నట్లు అనేక సంక్షేమ పథకాల ప్రవేశపెట్టినందుకు ఆయనకు కృతజ్ఞత అభినందనలు తెలియజేశారు ముందు ముందు రైల్వే కోడూరు అభివృద్ధి అంచలంచెలుగా అభివృద్ధి జరుగుతుందని భరోసా ఇచ్చినట్లు తెలిపారు పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని విధాల టిడిపి విజయకేతనం ఎగరవేయాలని సూచించినట్లు తెలుస్తోంది.

## మద్యం దుకాణాల లైసెన్స్ దారులతో ప్రత్యేక సమావేశం

**చిట్వేలి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :**

మద్యం దుకాణాలకు లైసెన్స్ గడువు త్వరలో ముగియనున్న సందర్భంగా రైల్వే కోడూరు ఎక్సైజ్ శాఖ అధికారులు లైసెన్స్ దారులతో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం లైసెన్స్ రెన్యువల్ ఎసులుబాటు కల్పించినందున ప్రతి ఒక్కరు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని అలాగే ఒక సంవత్సరం పాటు పొడగించిన కాలపరిమితిని వినియోగించుకోవాలని వారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివరించడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో స్థానిక మద్యం షాపుల లైసెన్స్ దారులు మరియు రైల్వే కోడూరు ఎక్సైజ్ శాఖ ఉన్నత అధికారులు పాల్గొనడం జరిగింది.

## వినాయకుని పూజల్లో వారికి మొక్కలు పంపిణీ చేసిన రామిరెడ్డి ధ్వజ రెడ్డి



**రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** రైల్వే కోడూరు మండలంలోని రెడ్డివారి పల్లి పంచాయతీ కేఎస్ అగ్రహారం లో వినాయకుని పూజ సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకులు రామిరెడ్డి ధ్వజారెడ్డి స్వామి పూజల్లో పాల్గొన్న యువకులకు క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ప్రతి ఒక్కరికి మొక్కలను బహుమతులుగా ఇచ్చి వాటి సంరక్షణకు కూడా బాధ్యత వహించాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రస్తుత కాలం ప్రకృతిని కాపాడుకోవాలని ఉద్దేశంతో చిన్నారులకు మొక్కలు పెంచే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు తోట శివ సాయి, దార్ల చంద్రశేఖర్, ఆనాల చెంగల్రెడ్డి, నాయిని హరికృష్ణ రెడ్డి, కౌ రెడ్డి సిద్దయ్య, బత్తిన ఆనంద్, అనంతరాజుపేట మైనార్టీ నాయకులు షఫీ, బత్తలమని, గౌతమ్ రెడ్డి, రమణారెడ్డి, ఆర్ వి రమణ తోపాటు గణపతి ఉత్సవ కమిటీ యువకులు పాల్గొన్నారు.

## కోడూరులో ఘనంగా పీఎం మోడీ జన్మదిన వేడుకలు..

**రైల్వేకోడూరు అర్బన్, సెప్టెంబర్ 17 ప్రభాత వార్త**

భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదిన వేడుకలను రైల్వేకోడూరు పట్టణంలోని టోల్గేట్ వద్ద ఉన్న బస్సు షెల్టర్ పక్కన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం చంగల్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంగల్ రాజు మాట్లాడుతూ దేశ చరిత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అత్యధిక ప్రజాదరణ కలిగిన ఏకైక ప్రధాని అని భారతదేశం గర్వించదగ్గ ముఖ్య నాయకులలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ అని ఆయన ఇటువంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, ఈ జన్మదిన వేడుకలను సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు ఏకధాటిగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పేదలకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కిషాన్ మోర్చా ఇన్చార్జి తోట శ్రీనివాసులు,సీనియర్ కార్యకర్తలు శంకర్రాజు,వాకచర్ల సుబ్బారావు,బత్తల సుబ్రహ్మణ్యం, కోడూరు మండల అధ్యక్షులు సాయం శ్రీధర్, ఓబుల్ వారి పల్లె మండల అధ్యక్షులు రూపేష్ రెడ్డి, మండల అధ్యక్షులు బాపూజీ, అసెంబ్లీ ఆఫీస్ సెక్రటరీ సుబ్బారావు, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి కుప్పాల జ్యోతి, బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కైలాసధామంకు షార్ రిటైర్డ్ ఉద్యోగి ఆర్థిక సాయం



**చంద్రగిరి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** చంద్రగిరిలో నూతనంగా నిర్మిస్తున్న కైలాసధామంకు రెడ్డివారిపల్లికి చెందిన రిటైర్డ్ షార్ ఉద్యోగి కందాటి రాజేంద్రబాబు గురువారం ఎంఎల్ఏ పులివర్తి నాని చేతులమీదుగా ఆర్థిక సహాయం చేశారు. దివంగత రిటైర్డ్ టీచర్ కందాటి రఘునాథశెట్టి, చెంచులక్ష్మమ్మ జ్ఞాపకార్థం రూ.1,01,116/-లు చెక్ రూపేనా ఎంఎల్ఏ ద్వారా కైలాసధామం కమిటీకి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఎల్ఏ అభినందించగా, కమిటీ అధ్యక్షుడు వీరంగారి రమేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు, క్లాస్ 1 కాంట్రాక్టర్ ఏ.వి.రమణమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూరు ధనంజయ రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత ప్రధాని జన్మదిన వేడుకలు

**చంద్రగిరి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:**



భారత ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన వేడుకలను గురువారం బిజెపి మండల అధ్యక్షుడు కాకిమాను మునిరాజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద నూతనంగా నిర్మించిన బిజెపి స్థూపంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి భాణాసంచా పేళుళ్ళ నడుమ కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిఎంగా నరేంద్రమోడీ 12 ఏళ్ళ ప్రయాణంలో సిఎంగా చంద్రబాబు నాయుడు 13 ఏళ్ళ పాలనా అనుభవం అనేక జనరంజక పథకాలతో పాలన అందిస్తున్నట్లు తెలిపారు. క్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు గాలి పుష్పలత, బి.డి.బాలాజి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని, మండల ఇన్‌చార్జ్ డాక్టర్ నరేష్, జిల్లా కార్యదర్శులు హరినాథ్ రెడ్డి, శ్రీదర్, సునీల్‌కుమార్ యాదవ్, నాయకులు మునెయ్య, దొరస్వామి, దొరస్వామి నాయుడు, నరేష్, శశికుమార్, మోహన్‌రాజు, టి.ఎ.ప్రసాద్, ఇందుశేఖర్, ప్రభాకర్ నాయుడు, జనార్ధన్ నాయుడు, మధు బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం.!

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం దశలవారీగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుందని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. గురువారం కుప్పం బాదూరు సచివాలయంలో "ఒక నెల ఒక గ్రామం నాలుగు పర్యటనలు" కార్యక్రమాన్ని తహశీల్దార్ మధుసూదన్ రావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులచుట్టూ రైతులు తిరగకుండా అధికారులే గ్రామాలలో రైతుల సమస్యల పరిష్కారం చేస్తారన్నారు. మొదటి పర్యటనలో వచ్చిన సమస్యలను రెండవ పర్యటనలో పరిష్కరించడం కోసం ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. రైతులు భూ సమస్యలు, ఇతర సమస్యలు ఏవైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు రాజశేఖర్, వెంకటరమణ, టిడిపి నాయకులు లెక్కల సురేంద్ర నాయుడు, ధనంజయ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## గోకులాపురం వినాయకస్వామి ఆలయంలో చోరీ




**రామచంద్రాపురం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** గోకులాపురంలోని వినాయకస్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును దోచుకుని వెళ్ళారు. గ్రామస్థుల వివరాల మేరకు.. వినాయక చవితి ఉత్సవాలు జరిగిన నేపథ్యంలో ఆలయంలోని హుండీలో పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించి భక్తులు మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. వారం రోజుల క్రితం గోకులాపురం సమీపంలోనే చైన్ స్నాచింగ్ జరగడంతో దొంగల భయంతో గ్రామస్థులు హడలెత్తిపోతున్నారు. పోలీసులు ప్రత్యేక గస్_ని ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## పుత్తూరులో ప్రధాని మోదీ పేరు మీద అర్చన

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:**



మనప్రియతమ ప్రధానమంత్రి మోదీ పుట్టిన రోజు సందర్భంగా పుత్తూరులో భారతీయ జనతా పార్టీ నాయకులు స్థానిక ఈశ్వరి గుడిలో ప్రత్యేక పూజలు, అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ఇటువంటి పుట్టిన రోజులు ఇంకా మరెన్నో జరుపుకోవాలని ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు కోటకొండ బాబు,మేకల సుబ్రహ్మణ్యం, గిరిప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి,శివరాజు, సుధాకర్, ఎం.కె.సుబ్రహ్మణ్యం, రామమూర్తిరాజు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా ప్రధాని మోదీ 76వ జన్మదిన వేడుకలు



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 17 ప్రభాత వార్త** తిరుపతి గాంధీరోడ్డులోని కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి. రాయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టీటీడీ పాలకమండలి సభ్యుడు జి.భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమంలో తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఇందులో భాగంగా 1,000 మంది పేదలు, నిరుపేదలకు అన్నదానం, వస్త్రదానం నిర్వహించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అన్నం, బట్టలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి. రాయులు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం, బట్టలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దేశ అభివృద్ధికి ప్రధాని పలు కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ గత 22 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.టీటీడీ పాలకమండలి సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. డాక్టర్ పి.సి. రాయులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష ్యంతో దేశ అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. తిరుపతిలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ పి.సి. రాయులు సేవలను ప్రశంసిం చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ సిబ్బంది, గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బండి మధుసూదన్ రెడ్డి, శివన్న, రాజేంద్ర ప్రసాద్, షాబుద్దీన్, ముని రత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు. పలువురు స్థానికులు సైతం కార్యక్రమానికి హాజరయ్యారు.



## ఎస్వీయూ నూతన రెక్టార్‌కు ఘన సన్మానం

**తిరుపతి విద్య సెప్టెంబర్ 17 ప్రభాత వార్త**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన రెక్టార్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఎన్. చంద్రాయుడును ఎస్వీయూ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. గజమాలతో సత్కరించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రొఫెసర్ ఎన్. చంద్రాయుడు నాయకత్వంలో విశ్వవిద్యాలయం విద్యా, పరిపాలనా రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు . విశ్వవిద్యాలయ సమగ్ర పురోగతిలో బోధనేతర సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, రెక్టార్ ఆధ్వర్యంలో వర్సిటీ అభివృద్ధికి తమవంతు సహకారం, సమన్వయం అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో శ్రీధర్ గుర్రంకొండ, నెల్లూరు సుబ్రహ్మణ్యం, కోటాగారం మురళి, కటారి గురు ప్రసాద్, ముత్తువేలు, సిరిగిరి రమేష్‌బాబు,దేపూరుగురు ప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 17 ప్రభాత వార్త**

2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ తెలిపారు.ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలి. ఎన్ఎంఎంఎస్ పరీక్ష నవంబరు 15న నిర్వహించనున్నారు.ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష రుసుము రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50గా నిర్ణయించారు. సెప్టెంబరు 11 నుంచి అక్టోబరు 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష రుసుమును అక్టోబరు 13లోపు ఆన్‌లైన్ దరఖాస్తులో పొందుపరిచిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల నామినల్ రోల్స్‌ను సంబంధిత ప్రధానోపాధ్యాయులు పరిశీలించి, ధ్రువీకరించిన అనంతరం అవసరమైన ధ్రువపత్రాలతో అక్టోబరు 14లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలి.పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలుసుకోవచ్చని డీఈఓ కె.వి.ఎన్. కుమార్ తెలిపారు.

## ప్రభుత్వం అందించే సబ్సిడిని అందిపుచ్చుకోండి.!

జిల్లా ఉద్యానవన అధికారి జయభరత్‌రెడ్డి



**చంద్రగిరి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:** ఉద్యానవన పంటలను పండించడానికి ప్రభుత్వం అందించే సబ్సిడీలను రైతులు అందిపుచ్చుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి జయభరత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని భీమవరం, ఐతేపల్లిలలో రైతులు వేసిన షెడ్ నెట్ హౌస్‌లను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ పర్లిన్ షెడ్ నెట్ హౌస్ నిర్మాణానికి ఎకరాకు రూ.9 లక్షలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇందులో పండించే కాయగూరల పంటలకు ఏడాది పాటు, పూల తోటలకు రెండేళ్ళ పాటు పంటను అనుసరించి రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. భీమవరం, కొండ్రెడ్డి కండ్రిగ, చిన్నరామాపురం పరిసర ప్రాంతాలలోని చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించడానికి పూలతోటల సాగుకు ఎకరాకు రూ.8 వేలు, కాయగూరల సాగుకు ఎకరాకు రూ.9,600/-లు, కలుపు పెరగకుండా వేసిన మల్చింలింగ్ తోటలకు ఎకరాకు రూ.8 వేలు వంతున ఉద్యానవన శాఖ రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు మీ భూమి యొక్క మట్టి నమూనా, నీటి నమూనాలను పరీక్ష చేయించుకుని మండల ఉద్యానవన అధికారి ఎస్.శైలజను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పి.రాణి, రైతులు పాల్గొన్నారు.



## ఎల్ నినో ప్రభావంపై ముందస్తు చర్యలు చేపట్టండి.!

ఎంఎల్ఏ పులివర్తి నాని

**చంద్రగిరి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:**

ఎల్ నినో ప్రభావం ప్రజలపై పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులు, టిడిపి నాయకులతో ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ప్రతి పంచాయతీని నిశితంగా పరిశీలించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అధికారులు, నాయకులు ప్రజలకు అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం, ప్రజా ఆరోగ్యం, మురుగునీటి సమస్య వంటి అంశాలపై సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఏదైన పరిష్కరించలేని సమస్యలున్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలన్నారు

## ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

తిరుపతి(రేణిగుంట) విమానాశ్రయంలో 'యాత్రి సేవా అభియాన్-2026'

**రేణిగుంట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:**

రేణిగుంట (తిరుపతి )విమానాశ్రయంలో యాత్రికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు

# శ్రీ చెంగాళమ్మ ఆలయ అభివృద్ధి లక్ష్యం : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీ చెంగాళ మాత పరమేశ్వరీ దేవి ఆలయాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానాన్ని అభివృద్ధి చేసే ప్రక్రియ భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నూతనంగా ట్రస్ట్ బోర్డు వేయాలని సంకల్పించినప్పటికీ కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయి అన్నారు. దీని దృష్టిలో ఉంచుకొని శ్రీచెంగాళమ్మ దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు అభివృద్ధి కమిటీని ఏడు మంది సభ్యులతో వేయడం జరిగిందన్నారు. గత ఆగస్టు నెలలో బాధ్యతలు చేపట్టిన ఈ కమిటీ ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనను సిద్ధం చేయడం జరిగిందని వాటికి త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే దేవస్థాన ప్రధాన దాతలుగా ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గంగా ప్రసాద్ తదితరులను సంప్రదించామని తెలిపారు. శ్రీ చెంగాళమ్మ దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకునూతనంగా బాధ్యతలు తీసుకున్న కమిటీ సేవకులుగా పనిచేస్తామని కమిటీ సభ్యులు తిరుమూరు సుధాకర్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు ఒక కోటి 45 లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించమన్నారు. ఇందులో 36 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం, వంటగది, స్టోర్ రూమ్, 9 అతిథి గృహాలను నిర్మించాలని సంకల్పించినట్లు తెలిపారు. అలాగే కళ్యాణ కట్ట దగ్గర మహిళలకు పురుషులకు వేరువేరుగా బాత్రూములు, డ్రెస్సింగ్ రూములు నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం వాటంపేడు మార్గంలో ఉన్న స్థలంలో కళాక్షేత్రం నిర్మాణంతో పాటు ఫెన్సింగ్, నిర్మించే ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయన్నారు. దేవస్థానంలో మంచినీటి కొరకు ప్రస్తుతం నిర్మాణంలో ఉండి అసంపూర్తిగా ఆగిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న కళ్యాణ మండపాన్ని ఏసి మండపంగా మార్చి అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ పనులన్నీ దాతల సహకారంతో చేపడుతామని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఏజీ కిషోర్, కమిటీ సభ్యులు పిట్ల సుహాసిని, పాములూరు మునిస్వామి, సురేష్ నాయుడు, పోలూరు బాలసుబ్రమణ్యం, వేమన బోయిన సుబ్రహ్మణ్యం, అలవల శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## కోట గురుకులాన్ని యథాతథంగా కొనసాగించాలి!



చిట్టమూరు, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం కళాశాల విద్యార్థుల సమస్యల సాధన సమితి (జేఏసీ) పిలుపు మేరకు గురువారం చిట్టమూరు మండల కేంద్రంలో జేఏసీ ప్రతినిధి మీజూరు నాగరాజు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీజూరు నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాలని డిమాండ్ చేశారు. కోటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకులాన్ని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో మూసివేయడం వల్ల సుమారు 600 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యార్థులను ఇతర గురుకులాలకు తరలించడంతో వసతి, విద్య తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే అందుకోసం ఇప్పటికే కొనసాగుతున్న గురుకులాన్ని మూసివేయడం సరికాదన్నారు. కోట గురుకులాన్ని యథాతథంగా కొనసాగిస్తూ, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, కోట గురుకులం కొనసాగింపు కోరుతూ మండల కేంద్రంలోని పాఠశాలలు, దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయాలని జేఏసీ పిలుపుకు స్పందించిన కొన్ని పాఠశాలలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేయగా, మరికొన్ని యథావిధిగా కొనసాగాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి కోట గురుకులాన్ని కొనసాగించాలని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని జేఏసీ ప్రతినిధి మీజూరు నాగరాజు తెలిపారు. ఆయనతోపాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, స్థానిక యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## అరవపాలెం విద్యార్థులకు బెర్జిన్ పైప్స్ చేయూత



చిట్టమూరు, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: మండలంలోని అరవపాలెం సాంఘిక సంక్షేమ వసతి గృహం, సన్నారెడ్డి బాల కృష్ణారెడ్డి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు బెర్జిన్ పైప్స్ సంస్థ చేయూత అందించింది. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం బెర్జిన్ పైప్స్ జనరల్ మేనేజర్ గురుస్వామి, శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి ప్రారంభించారు. వసతి గృహంలో 20 లక్షల వ్యయంతో నూతన వంటగదిని నిర్మించడంతో పాటు మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టారు. బాలకృష్ణారెడ్డి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి ఉపయోగపడేలా నిర్మించిన నూతన లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి బెర్జిన్ పైప్స్ సంస్థ అందించిన సహకారం అభినందనీయమన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ ప్రత్యేక చొరవకు పరిశ్రమల చురుకైన భాగస్వామ్యం తోడవడంతో పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని ఆమె తెలిపారు. నూతన వసతులు అందుబాటులోకి రావడంపై పాఠశాల, హాస్టల్ అధికారులు బెర్జిన్ పైప్స్, శ్రీసిటీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెర్జిన్ పైప్స్ సీనియర్ మేనేజర్ అల్తాఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, హాస్టల్ వార్డెన్ కుమార్, శ్రీసిటీ ప్రతినిధులు ఉద్దూరు రాజగోపాల్, సురేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి జన్మదినం... సేవా కార్యక్రమాలు



చిట్టమూరు, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా చిట్టమూరు మండలంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చిట్టమూరు మండల అధ్యక్షులు పేట నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్, పోలీస్ స్టేషన్, బ్యాంకు, ఎంపీడీవో కార్యాలయాల్లోని సిబ్బందిని కలిసి మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మగుంట భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి పవిత్రోత్సవాలు : ఇఓ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 22 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయని ఇఓ బికె వెంకటేశులు గురువారం మీడియాకు వివరించారు. ప్రతి ఏడాది నిర్వహించే పవిత్రోత్సవాలను నిర్వహించుటకు సంబంధించి ఆలయ అర్చకులు, వేదపండితులు తేదులను ఖరారు చేసినట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను ఆయన వివరించారు. ప్రతి రోజు యాగశాల నుంచి పట్టువస్త్రాలు, పట్టు పవిత్రాలు, పాదుకలు, సుగంధ ద్రవ్యాలను ఊరేగింపుగా వినాయకస్వామి, చెంగల్వరాయ స్వామి స్వామి అమ్మవార్ల గర్భాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి యాగశాలకు చేర్చబడుతుందన్నారు. పవిత్రోత్సవాలు జరిగే రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5.30నుంచి రాత్రి 7.30గంటల వరకు గర్భాలయంలో విశేష పూజలు నిర్వహించబడుతుంది కాబట్టి ఆ సమయంలో అంతరాలయ దర్శనం రద్దు చేసినట్లు ఇఓ ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా అంతరాలయ ప్రత్యేక దర్శనం రద్దు చేసినట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు ఉదయం 10గంటలకు నిర్వహించే ఉచ్చికాల అభిషేకాన్ని ఉదయం 9.30గంటలకే నిర్వహించబడుతుందన్నారు. ఈ మార్పును భక్తులు గమనించాలన్నారు. పవిత్రోత్సవాలు జరిగే ఐదు రోజులు విఐపిలకు తట్ట, మేళం, సేవలుండవన్నారు.

# గణనాధునికి 'శివయ్య' పట్టు వస్త్రాలు బహూకరణ



కాణిపాకం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. ప్రతి ఏటా కాణిపాకం దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు గురువారం శ్రీకాళహస్తీ దేవస్థానం ఈఓ కొట్టే సాయి, ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, ఆలయ అధికారులు, అర్చకులు కాణిపాకం దేవస్థానం ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లతో కలసి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. వీరు గురువారం కాణిపాకం చేరుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. ఈమేరకు పట్టువస్త్రాలను స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ అర్చకులకు అందజేశారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామి, అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను, శేషవస్త్రాలను, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. అలాగే శ్రీకాళహసి దేవస్థానం తరపున కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ అధికారులను సత్కరించి స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం ప్రధాన అర్చకులు సంభందం గురుకుల్, ఏఈఓ మోహన్, సూపరెండెంట్ శ్రీహరి పాలకమండలి సభ్యులు మురళీ, హైమావతి, విజయమ్మ, గుర్రప్పశెట్టి, కాణిపాకం ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి, పాలకమండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## గణనాధునికి వైభవంగా గ్రామోత్సవం



కాణిపాకం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన మూషికవాహనసేవ సందర్భంగా ఉదయం సిద్దిబుద్ది సమేత గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం యాగశాలలో అర్చకులు యాగమూర్తికి శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే అలంకరించిన సిద్ది బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులను ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు మొక్కులు తీరు ్చకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓ రవీంద్రబాబులతో పాటు ఉభయదారులు పాల్గొన్నారు.

## సృష్టికి ఆద్యుడు, శిల్పకళకు ఆచార్యుడు విరాట్ విశ్వకర్మ

**- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**



చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: సృష్టికి ఆద్యుడు, శిల్పకళకు ఆచార్యుడు విరాట్ విశ్వకర్మ అని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ విరాట్ విశ్వకర్మ మహర్షిగా, సృష్టికర్తగా, శిల్పకళా నిపుణుడిగా, వాస్తుశాస్త్ర పితామహుడిగా గౌరవిస్తారన్నారు. సృజనాత్మకత, శిల్ప నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, కష్టపడి పనిచేసే తత్వానికి విశ్వకర్మ మహర్షి ప్రతీకగా నిలుస్తారన్నారు. ఆయన స్ఫూర్తిని వృత్తి నిపుణులు, శిల్పులు, కార్మికులు మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలను గౌరవించడం, యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం, సంప్రదాయ వృత్తులను పరిరక్షించడం ద్వారా నైపుణ్యంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్‌కుమార్, జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీ భాషా, విశ్వర్మ నాయకులు రవి, సురేష్ అచ్చారి, శివకుమార్ అచ్చారి, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో షటిల్‌బస్సు సర్వీసులు ప్రారంభం

సత్యవేడు, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ(ఐఏఎల్ఏ-ఐలా) ఆధ్వర్యంలో శ్రీసిటీలోఅంతర్గతుచిత షటిల్ బస్సు సర్వీసులను ప్రారంభించారు. గురువారం ఉదయం జీరో పాయింట్ వద్ద ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయభరత్ రెడ్డి జెండా ఊపి సర్వీసులను ప్రారంభించారు. శ్రీసిటీలో సామాజికమౌలిక వసతులను బలోపేతం చేయడంలో ఇదో మరో ముందడుగుగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. రవాణా సదుపాయం అందించడం ద్వారా ఉద్యోగులు, విద్యార్థులు, సందర్శకులు, పరిసర గ్రామాల ప్రజలకు ఇది ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

## సింహ, ముత్యపు పందిరి వాహనాలపై కల్యాణ వెంకన్న

**- తుమ్మలగుంటలో భక్తిరస వెల్లువ**



తిరుపతి రూరల్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజు గురువారం భక్తిరస పూరిత వాతావరణం నెలకొంది. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు యోగ నరసింహుని అవతారంలో స్వామివారు సింహ వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, భజనలు, చెక్కభజనలు, కోలాటాలతో వాహనసేవ వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కర్పూర హారతులు సమర్పించి స్వామివారి ఆశీస్సులు పొందారు. స్థానిక యువకులతో కలిసి తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వాహనాన్ని మోసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సారెను సమర్పిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. అదే రోజు రాత్రి ఉభయ దేవేరులతో కలిసి శ్రీ మలయప్ప స్వామివారు ముత్యపు పందిరిలో బాలకృష్ణుని అవతారంలో అలరించారు. ముందుగా కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరు మంజనం నిర్వహించగా, అనంతరం ఆలయం వెలుపల ఊంజల సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొత్తంగా బ్రహ్మోత్సవాల మూడవ రోజు తుమ్మలగుంటలో ఆధ్యాత్మిక ఉత్సాహం ఉట్టిపడింది.

## సింహవాహనంపై శ్రీమన్నారాయణుడు







తిరుమల, సెప్టెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: ధైర్యం, పరాక్రమం, తేజస్సుకు ప్రతీకగా సింహ వాహనసేవ ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి జరిపిస్తారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు గురువారం ఉదయం మలయప్పస్వామి యోగ నరసింహుని అలంకారంలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సింహ వాహనంపై కొలువుదీరిన మలయప్పస్వామి దివ్య మంగళరూపాన్ని దర్శించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ధైర్యసిద్ధికి ప్రతీక దుష్టశిక్షణ, శిష్టరక్షణకు ప్రతీకగా మలయప్పస్వామి సింహ వాహనాన్ని అధిరోహిస్తారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సి.హెచ్. వెంకయ్య చౌదరి, సివిఎస్ఓ కే వి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## షార్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




సూళ్లూరుపేట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరి కోటలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చెన్నై శాస్త్ర విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ స్వామినాథన్ మాట్లాడుతూ గురువులను గౌరవించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గుర్తుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంతో విద్యార్థులకు గురువులపై భక్తి భావం పెరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన శ్రీహరికోట, సూళ్లూరుపేట స్పేస్ సెంట్రల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎస్ శశి భూషణ్, అమర్నాథ్, సిహెచ్ పరమేశ్వరీ దేవి, ఎన్.ఆర్ ఉష, ఎస్ మస్తానయ్య, సజిత, వి. సుమన్, సత్య సాయి బాబలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ఎస్ ముత్తు చళియన్, అసోసియేట్ డైరెక్టర్ జి.రమేష్ బాబు, కంట్రోలర్ వై.శ్రీనివాసరావు, స్పేస్ సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపల్ రామకృష్ణతదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: నియోజకవర్గంలో 33 మంది బాధితులకు 26,70,040 రూపాయల విలువైన చెక్కులను గురువారం బాధితులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజక వర్గంలో ఇప్పటివరకు 661 లబ్ధిదారులకు 6,01,06,144 రూపాయలను అందజేసినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. మోడీ జన్మదిన దీపోత్సవ కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని దీపోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులు మీదుగా ఘనంగా నిర్వహించారు. ప్రజలతో కలసి ఆమె దీపాలను వెలిగించి ప్రధాని నరేంద్ర మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లగలిగిన సత్తా నరేంద్ర మోడీకి మాత్రమే ఉందని ఆమె తెలిపారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



బాలాయపల్లి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన నివాస గృహంలో 14 మందికి 13 లక్షల 50 వేల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పేదలు ఆస్పత్రులలో అప్పులు చేసి వైద్యం చేసుకుంటుంటారని వారి కష్టాన్ని తీర్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు సహాయ నిధి చెక్కులను ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. బటన్ నొక్కానని జగన్మోహన్‌రెడ్డి చెప్పుకుంటున్నారు. తప్ప పేదలకు ఎలాంటి సహాయం చేయలేదన్నారు. వైసీపీకి ప్రజలు తగు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దొంతు శారద, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళి రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతరలో సామాన్య భక్తులకే ప్రాధాన్యత : ఎమ్మెల్యే



బాలాయపల్లి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : ఈ నెల 30, అక్టోబర్ నెల ఒకటో తేదీ జరగబోవు వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో అమ్మవారి దర్శనానికి సామాన్య భక్తులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పోలేరమ్మ గుడి వద్ద జాతర వాల్ పోస్టర్, కరపత్రాలను ఎమ్మెల్యే, ఛైర్మన్ మురళీకృష్ణ, వివో శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఆలయాలను అభివృద్ధి చేయకుండా నిర్వీర్యం చేసిందని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలులో కూటమి ప్రభుత్వం అగ్రస్థానంలో ఉందని చెప్పారు. ఎల్‌నీనో ప్రభావం నుండి పంటలను, పశువులను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.. నీటి సమస్య లేకుండా నదులను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దొంతు శారద, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, రూరల్ మండల్ పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, జాతర సేవా కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, చెంజి తిరుపాల్రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు వెంకట ముని, జి రాము, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వోకు వీధి వ్యాపారస్తులు వినతి పత్రం



తడ, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని వీధి వ్యాపారస్తులు తడ ఎమ్మార్వో రవికుమార్‌కు గురువారం వినతి పత్రం అందించారు. గత 20 సంవత్సరాల నుండి జాతీయ రహదారి అనుకొని తోపుడు బండ్ల పైన 60 మంది వీధి వ్యాపారస్తులు పండ్లు కూరగాయలు ఆకుకూరలు చేపల వ్యాపారం నిర్వహి స్తూ జీవనం సాగిస్తున్నామని అయితే కొద్ది రోజుల క్రితం ఎన్‌హెచ్‌ఏఐ వారు వీధి వ్యాపారస్తులు రోడ్డు పక్కన వ్యాపారం నిర్వహించరాదని హెచ్చరించారని తమ బండ్లను తొలగిస్తామని నోటీసులు జారీ చేశారని అలా తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వ్యాపారం పై ఆధారపడి జీవిస్తున్నామనిప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించాలని ఎమ్మార్వోకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, వీధి వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



తడ, సెప్టెంబరు 17ప్రభాతవార్త: తడ పట్టణంలో నిప్పొ పరిశ్రమ నందు వినాయక చవితి ఉత్సవాలు మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్నారు హెచ్ ఆర్ రమేష్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్ర మాలు భజన కార్యక్రమం, అన్నదానం, ఉట్టి నిర్వహించారు. బుధవారం నిమజ్జనం ఘనంగా సాగింది.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



తడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: సృష్టికర్త భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలు గురువారం తడ పట్టణం నందు బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గోపి ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భగవాన్ విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ వృత్తిని దైవంగా భావించే శ్రామికుల కృషికి గౌరవించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా తిరుపతి జిల్లా అధ్యక్షులు గోపి ఆచారి తడ మండల బిజెపి అధ్యక్షుడు చిల్లకూరు తేజరెడ్డి, తడ మండల విశ్వకర్మ అధ్యక్షులు పరంధామన్, బిజెపి నాయకులు వివిధ చేతివృత్తుల వారు పాల్గొన్నారు.

18 CTR 5:18 CTR 5.qxd 9/17/2026 11:10 PM Page 1



# తిరుపతి డివిజన్

## హెచ్ఐవీ నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

యర్రావారిపాలెం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:



హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతో పాటు, అవసరమైన వారు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని పాస్ సంస్థ ప్రతినిధులు ఏఎన్ఎం జ్యోతి, తులసి సూచించారు. గురువారం యర్రావారిపాలెం మండలంలోని నాగినేనివారిపల్లి గ్రామంలో పాస్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు హెచ్ఐవీ వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, పరీక్షల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాస్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ హెచ్ఐవీపై అపోహలు వీడి, వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనుమానం ఉన్న వారు తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ద్వారా ఉచిత వైద్యం, ఉచిత మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే పరీక్షలు, చికిత్సకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుతామని వివరించారు.హెచ్ఐవీపై సరైన అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్ సంస్థ ప్రతినిధులు చిట్టెమ్మ, ఆశా కార్యకర్త ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతో ఆరోగ్యకర జీవనం

పులిచెర్ల,సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:



పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని పులిచెర్ల ఐసీడీఎస్ సీడీపీఓ వాణిశ్రీదేవి తెలిపారు. పోషణ మాసోత్సవంలో భాగంగా పులిచెర్ల వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు, పాలు, గుడ్లు వంటి పోషకాహారాన్ని నిత్యం తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఏపీఎం కుమారస్వామి మాట్లాడుతూ పోషకాహారంపై అవగాహనను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని స్వయం సహాయక సంఘాల సభ్యులకు సూచించారు.కార్యక్రమంలో ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసి చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సుహాసిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎస్ అధ్యక్షురాలు పద్మ, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

## మంచి పుస్తకం 1000 మంది మేధావులతో సమానం

రేణిగుంట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:



ఒక మంచి వెయ్యి మంది మేధావులతో సమానమని ఉభయ చిత్తూరు తిరుపతి జిల్లాల గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి ఉద్ఘాటించారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లి గ్రామంలోని మినీ గ్రంథాలయం (టీడీసీ సెంటర్)ను ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయంలోని గ్రామస్తులు, పాఠకులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన, న్యూస్ పేపర్లు అందుబాటులో ఉన్నాయా, ప్రతి 15 రోజులకు ఒకసారి రేణిగుంట శాఖా గ్రంథాలయం నుంచి పుస్తకాలు అందుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో గ్రామీణ స్థాయిలో గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలనే లక్ష్య ంతో పనిచేస్తోందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపయోగపడే పుస్తకాలు మినీ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, గ్రామీణ ప్రాంత యువత వాటిని సద్వినియోగం చేసుకుని తమ విజ్ఞానాన్ని, మేధాశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మినీ గ్రంథాలయ నిర్వాహకుడు ముద్దు కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన ఎదుగుదల

రేణిగుంట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:



రేణిగుంట మండలం రాజీవ్‌గాంధీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మాస ఉత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. గర్భధారణ నుంచి చిన్నారుల మొదటి 1000 రోజులు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో కీలకమని తెలిపారు. సమతుల ఆహారంతో పాటు స్థానికంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. పిల్లలకు వయస్సుకు అనుగుణంగా పౌష్టికాహారం అందించాలని, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## తొలి ఆరాధ్య దేవుడు విఘ్నేశ్వరుడు

రేణిగుంట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:



వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు రేణిగుంట జీఎం వీధిలోని శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులు, స్థానికులకు నిర్వాహకులు అల్పాహార విందు ఏర్పాటు చేసి ఆతిథ్యం అందించారు. ఢిల్లీ బాబు, కళ్యాణి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన సేవలో సుమారు 300 మంది భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.తొలి ఆరాధ్య దేవుడైన విఘ్నేశ్వరుని కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ఆయన అనుగ్రహంతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షి స్తూ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తి శ్రద్ధలతో పాటు సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. వినాయకుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని నిర్వాహకులు ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ కమిటీ సభ్యులు లక్ష్మణ్, జూలియన్ రాజు, సుమన్, ధనుంజయ నాయుడు, కళ్యాణ్, ప్రభు, మురళి, ప్రదీప్, పవన్, సాయి, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేషనల్ సైన్స్ సెమినార్‌లో విద్యార్థుల అద్భుత ప్రతిభ



ఎంఈఓ శ్రీవరం లలితకుమారి

చంద్రగిరి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:

నేషనల్ సైన్స్ సెమినార్ 2026లో విద్యార్థుల అద్భుత ప్రతిభ కనబరిచినట్లు ఎంఈఓ శ్రీవరం లలితకుమారి తెలిపారు. స్థానిక శ్రీ పద్మా వతీ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి నేషనల్ సైన్స్ సెమినార్ 2026 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీలలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కె.ఖలీల్ మొదటి స్థానం దక్కించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా శ్రీ పద్మా వతీ బాలికల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.రాధిక ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఆ మేరకు వీరి ద్దరూ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం

## శ్రీవారి వాహనసేవల్లో

### కళా వైభవానికి టిటిడి ఈఓ అభినందనలు

### -ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాలుగు కళా బృందాలకు సన్మానం

తిరుమల,సెప్టెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల సందర్భంగా భక్తులను అలరిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులను గుర్తించి, ప్రతిరోజూ ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన కళా బృందాలకు సన్మానం చేయాలని టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర అధికారులను ఆదేశించారు. తొలిగా గురువారం సింహ వాహనసేవ సందర్భంగా శ్రీవారి ఆలయ మాడ వీధుల్లో వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ, జానపద కళారూపాలను ఈఓ స్వయంగా తిలకించారు. కళాకారుల ప్రతిభను పరిశీలించి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ,అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు, ఎస్.వి. కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ డాన్స్ నుండి ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన నాలుగు కళా బృందాల ప్రతినిధులను అభినందించి సన్మానించారు.

**హిందూ ధర్మ ప్రచార పరిషత్ - ఉత్తమ ప్రదర్శన కళా బృందం**

జార్ఖండ్ రాష్ట్రంకు చెందిన గౌరసూర్ చౌ,సృష్టి ధర్ మహతో బృంద సభ్యులను, అన్నమాచార్య ప్రాజెక్టు విభాగంలో జానపద నృత్యం హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన బృంద నాయకుడు సంతోష్ కుమార్ సవారియా, బృంద సభ్యులను, దాస సాహిత్య ప్రాజెక్టు బృంద నాయకురాలు కళ అనంతపురం జిల్లాకు చెందిన రామ చరితం జి. సంధ్యా మూర్తి బృందం సభ్యులను ,ఎస్.వి. కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ డాన్స్ కళా బృందం బృందం దశావతారాలు బృంద నాయకుడు పూర్వ విద్యార్థి డా. పి. శరత్ చంద్ర బృంద సభ్యులను భారతీయ కళా సంస్కృతికి తిరుమలలో విశిష్ట వేదిక సన్మానించారు. వాహన సేవల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళా బృందాలను గుర్తించి తగిన గౌరవం కల్పించడం ద్వారా రాబోయే బ్రహ్మోత్సవాల్లో కళాకారులు మరింత నాణ్యమైన, వైవిధ్యభరితమైన, ఆకట్టుకునే ప్రదర్శనలు అందించేందుకు ప్రోత్సాహం లభిస్తుందని ఈఓతెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల కళారూపాలకు తిరుమలలో వేదిక కల్పించడం ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని భక్తులకు పరిచయం చేస్తున్నామని చెప్పారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో

### ట్యాగ్ కట్టుకోండి...మీ భద్రత మా బాధ్యత

తిరుమల,సెప్టెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:



ట్యాగ్ కట్టుకోండి...మీ భద్రత మా బాధ్యత అనే సందేశంతో భక్తులకు అవగాహన కల్పిస్తూ చిన్నారులు, వృద్ధులకు పోలీసులు జియోట్యాగ్‌లు ధరింపజేస్తున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రద్దీ ప్రాంతాల్లో తమ వెంట వచ్చే చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారిని ఒంటరిగా వదిలివేయకుండా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. సిసి కెమెరాలు, డ్రోన్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా రద్దీ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షి స్తూ, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించారు. సాలకట్ల బ్రహ్మోత్సవాలలో అనూహ్యరద్దీతో చిన్నపిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. చిన్నపిల్లల భద్రతకు జియోట్యాగింగ్ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువచ్చారు.

## పద్మావతి వర్సిటీలో ఇద్దరికి డాక్టరేట్లు

తిరుపతి,సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:





పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో ఇద్దరు పరిశోధక విద్యార్థినులకు డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ ఎకనామిక్స్ విభాగానికి చెందిన ధమార్చర్ల జాహ్నవికి మహిళా అధ్యయనంలో చేసిన పరిశోధనకు వర్సిటీ డాక్టరేట్ అందచేసింది. విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి. సంధ్యారాణి , కోగైడ్‌గా డాక్టర్ పి. నీరజ మార్గనిర్దేశకత్వంలో "వయోలెన్స్ ఎగైనెస్ట్ గర్ల్ చిల్డ్రన్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు చైల్డ్ అబ్యూస్ ఏ స్టడీ ఇన్ చిత్తూరు కడప డిస్ట్రిక్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు.ఈ మేరకు విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టరేట్ ప్రదానం చేసింది.-భారతికి డాక్టరేట్: మహిళా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ ఎకనామిక్స్ ( విమెన్స్ స్టడీస్) విభాగం పరిశోధక విద్యార్థి కుంభకోణం భారతి కి మహిళా అధ్యయనంలో చేసిన పరిశోధనకు వర్సిటీ డాక్టరేట్ అందచేసింది. "యుటిలిజేషన్ అండ్ సాటిస్ఫాక్షన్ విత్ సర్వీసెస్ అమాంగ్ బెనీఫిసిరీస్ ఆఫ్ జననీ సురక్షా యోజన ఇన్ సెలెక్టెడ్ రెవెన్యూ డివిజన్స్ ఆఫ్ చిత్తూరు డిస్ట్రిక్ట్ , ఆంధ్రప్రదేశ్ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు.

## గంగమ్మ హుండీ ఆదాయం

### రూ.50లక్షలు

తిరుపతి,సెప్టెంబర్ 17ప్రభాతవార్త:



తిరుపతి నగర గ్రామదేవత తాతయ్య గుంట గంగమ్మ దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు గురువారం జరిగింది. ఆలయంలోపల శాశ్వత హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను కంధాల గోవిందచార్యులు ట్రస్ట్ ఈఓ పి. రామక్రిష్ణా రెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. 90 రోజుల ఆదాయం 50,87,567 రూపాయలు లభించింది. 60.400 మిల్లీ గ్రాములు బంగారు, 307గ్రాములు వెండి చేకూరింది. విదేశీ కరెన్సీ 45 యుఎస్ఎ డాలర్స్, 220,50 కువైట్ దినర్స్ ఉన్నాయి. ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ ,ఈఓ ఎ. జయకుమార్ ఉన్నారు.

## ప్రధానిగా నరేంద్ర మోదీ విశ్వ విజేత

తిరుపతి,సెప్టెంబర్ 17ప్రభాతవార్త:





భారతదేశ ప్రధానిగా హ్యాట్రిక్ సాధించి కోట్లాదిమంది భారతీయుల మదిలో సుస్థిరమైన స్థానాన్ని చెరగని ముద్రను ఏర్పరచుకున్న నరేంద్ర మోదీ విశ్వవిజేత అని బిజెపి నేతలు కొనియాడారు. మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో బిజెపి నేత గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ పేరున అర్చనలు చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. టెంకాయలు కొట్టి, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు నవీన్ కుమార్ రెడ్డి, సీనియర్ నేత చంద్రారెడ్డి, పొనగంటి భాస్కర్,అశోక్, అనిల్ రెడ్డి మాట్లాడుతూ ఓ సామాన్యమైన వ్యక్తి నుంచి భారత దేశ ప్రధానిగా మూడవసారి హ్యాట్రిక్ కొట్టి "బిజెపి జెండా భారతీయులకు అండ" అన్న నినాదంతో ప్రపంచ దేశాల చిత్రపటంలో భారతదేశ స్థానాన్ని అగ్రస్థానంలో నిలిపిన మహోన్నతమైనటువంటి వ్యక్తి మోదీ అన్నారు. భారతీయులకు అండగా నేనున్నాను అని భరోసా ఇస్తూ ప్రపంచ దేశాల చిత్రపటంలో అగ్రస్థానంలో భారతదేశ ఔన్నత్యాన్ని సంస్కృతి సాంప్రదాయాలను ఎలుగెత్తి చాటిన గొప్ప జన హృదయ నేత అన్నారు. భారతదేశానికి బలమైన నాయకత్వం ప్రేరణ మోదీయేనని వక్కాణించారు. ఈ కార్యక్రమంలో తాతయ్య గుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, బిజెపి నాయకులు చంద్రారెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, పొన్నగంటి భాస్కర్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, దీపక్ యాదవ్, దస్తగిరి రెడ్డి, ఆదం అనిల్ రెడ్డి, మస్తాన్ ,విగ్రహాల కళ్యాణి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, నరసింహ యాదవ్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## మంచి జీవనశైలితో వ్యాధులకు దూరంగా ఉండొచ్చు

పులిచెర్ల, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:

మంచి జీవనశైలితో అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పులిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో "సేవ సంకల్ప్ అభియాన్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఉప్పు, చక్కెర, నూనెల వినియోగాన్ని తగ్గించాలని, ప్రతిరోజూ వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలని సూచించారు. తగినంత నిద్ర, మానసిక ప్రశాంతతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.అక్టోబర్ 17 వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మాతా శిశు సంరక్షణ, టీకాలు, రక్తహీనత నివారణ, దీర్ఘకాలిక వ్యాధులు, మానసిక ఆరోగ్యం, టెలీమానస్, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు మునిరత్నం, సీనియర్ అసిస్టెంట్ వరసుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, పర్యవేక్షకులు ప్రమీల, పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

## సీబీఎస్ఈ బాస్కెట్‌బాల్‌లో ఎస్వీఐఎస్ జోరు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 17 ప్రభాత వార్త



శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ (ఎస్వీఐఎస్) అండర్14 బాలుర బాస్కెట్‌బాల్ జట్టు సీబీఎస్ఈ క్లస్టర్7 ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 188 జట్లతో పోటీపడి ప్రథమ స్థానాన్ని సాధించింది. దీంతో పంజాబ్‌లో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు జట్టు అర్హత సాధించింది.సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 6 వరకు పంజాబ్‌లోని బటిండాలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ సీబీఎస్ఈ క్లస్టర్లలో అర్హత సాధించిన జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. జాతీయ స్థాయిలో అత్యుత్తమ పాఠశాల జట్లతో తలపడే అవకాశం ఎస్వీఐఎస్ క్రీడాకారులకు లభించనుంది.ప్రణాళికాబద్ధమైన శిక్షణ, కోచింగ్, క్రీడా మౌలిక వసతులతో విద్యార్థులను ఉన్నత స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా శ్రీ విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఈడీ, ధర్మకర్త వినయ్ మహేశ్వరి మాట్లాడుతూ అండర్14 జట్టు క్లస్టర్ ఛాంపియన్‌గా నిలవడం గర్వకారణమన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తితో రాణించారని పేర్కొన్నారు. జాతీయ ఛాంపియన్‌షిప్‌లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు.ఇప్పటికే సీబీఎస్ఈ క్లస్టర్ పోటీల్లో అండర్17, అండర్19 బాలుర, అండర్ 19 బాలికల వాలీబాల్ జట్లు ఛాంపియన్లుగా నిలిచాయి. తాజాగా అండర్14 బాలుర బాస్కెట్‌బాల్ జట్టు కూడా క్లస్టర్ విజేతగా నిలవడంతో ఈ విద్యా సంవత్సరంలో ఎస్వీఐఎస్ క్రీడా ప్రతిభ మరోసారి వెలుగులోకి వచ్చింది.

## అధ్యయన కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తా



డా.ఎం. కిరణ్‌కుమార్ రాజు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 17 ప్రభాత వార్త

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తిరుపతి అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం. కిరణ్‌కుమార్ రాజు పదవీ బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. కిషన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరావు, వార్డెన్ డాక్టర్ ఎం. ప్రసాదరావు, సీనియర్ అధ్యాపకులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ రాజు మాట్లాడుతూ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం ద్వారా విద్యార్థులకు అందుతున్న విద్యా సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఉద్యోగులు, వివిధ కారణాలతో రెగ్యులర్‌గా కళాశాలకు వెళ్లలేని విద్యార్థులకు ఓపెన్ యూనివర్సిటీ విద్య ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అధ్యయన కేంద్రానికి వచ్చే విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, విద్యా సమాచారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అధ్యయన కేంద్రం అభివృద్ధికి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల సహకారం అవసరమని పేర్కొన్న ఆయన, అందరి సమన్వయంతో కేంద్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థుల విద్యా అవసరాలకు అనుగుణంగా సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారిస్తామని తెలిపారు.నూతన కోఆర్డినేటర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రిన్సిపల్ డాక్టర్ జి. కిషన్, అధ్యయన కేంద్రం కార్యకలాపాలు సమర్థవంతంగా కొనసాగాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్వీయూ నూతన రెక్టర్‌గా ఆచార్య ఎన్.చంద్రాయుడు





### నియామకం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త

ఎస్వీయూ నూతన రెక్టర్‌గా ఆచార్య ఎన్.చంద్రాయుడు నియమితులయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య తాటా నర్సింగారావు ఆయనను రెక్టర్‌గా నియమించారు. గురువారం సాయంత్రం వర్సిటీ ఉపకులపతి కార్యాలయంలో ఉపకులపతి ఆచార్య తాటా నర్సింగారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదుగా ఆచార్య ఎన్.చంద్రాయుడు నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన రెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆచార్య ఎన్.చంద్రాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ పెద్దలకు, వర్సిటీ ఉపకులపతికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తానన్నారు.ఆచార్య ఎన్.చంద్రాయుడు ప్రస్తుతం ఎస్వీయూ సైన్సెస్ కళాశాలలోని భూగోళశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వ్యవసాయ భూగోళశాస్త్రం, జియోస్పేషియల్ టెక్నాలజీలతో జలవనరుల అభివృద్ధి ఆయన పరిశోధనా ఆసక్తి రంగాలు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 47 పరిశోధనా వ్యాసాలను ప్రచురించారు. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, సదస్సుల్లో 120 పత్రాలను సమర్పించారు.ఆయన మార్గదర్శకత్వంలో ఆరుగురు పీహెచ్‌డీ, ఎంఫిల్ పరిశోధకులు పట్టాలు పొందగా, ప్రస్తుతం నలుగురు పరిశోధకులు పీహెచ్‌డీ చేస్తున్నారు. ఎస్వీయూ ఐఏఎస్ఈలో 7.5 సంవత్సరాల పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, వర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఎస్వీయూ క్యాంపస్ క్రమశిక్షణా కమిటీ సభ్యుడిగా, భూగోళశాస్త్ర విభాగం అధిపతిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.మైసూరు విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయాల భూగోళశాస్త్ర విభాగాలకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా సేవలందించారు. నేషనల్ జియోగ్రాఫికల్ జర్నల్ ఆఫ్ ఇండియా సంపాదకవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన ఆధ్వర్యంలో రెండు పరిశోధనా ప్రాజెక్టులు పూర్తికాగా, మరో ప్రాజెక్టు కొనసాగుతోంది. శ్రీలంక, సింగపూర్, మలేషియా దేశాలను సందర్శించారు. పలు జాతీయ విద్యా, పరిశోధనా సంస్థల్లో జీవితకాల సభ్యత్వం కలిగి ఉన్నారు.నూతన రెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఎన్.చంద్రాయుడును వర్సిటీ అధ్యాపకులు, మాజీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎస్వీయూ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అభినందించారు. టీఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు డాక్టర్ గిరి నాయుడు, డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ పాకనాటి హరికృష్ణ, డాక్టర్ రాంబాబు నాయుడు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు ఆనంద్ గౌడ్, రామ్మోహన్, ఎస్వీయూ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు

## కారణ జన్ముడు నరేంద్ర మోది

### - జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు బత్తిన మధుబాబు

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త

జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల తరఫున ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు బత్తిన మధుబాబు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రపంచ దేశాలలో భారతదేశం గర్వించదగ్గ స్థాయిలో ఉంది అంటే దానికి కారణం ప్రధాని నరేంద్ర మోడీనే అన్నారు.నరేంద్ర మోడీ ముందు పరిపాలన,వచ్చిన తర్వాత పరిపాలన చూస్తే అర్థం అవుతుందని, ఉగ్రవాదాన్ని,బాంబు బెల్స్ ని,కనుమరుగు చేసిన వ్యక్తి మోదీ అన్నారు.ఒక పక్క సనాతన ధర్మాన్ని, మరోపక్క హిందూ ధర్మాన్ని రెండిటినీ కాపాడుతూ వస్తున్న వ్యక్తి మోదీ అని చెప్పటానికి గర్వంగా ఉందన్నారు. గతంలో ప్రజలు భయపడుతూ బతికే వాళ్ళని,ఆపరేషన్ సింధు పేరుతో ఉగ్రవాదాన్ని రూపుమాపి ఆడపడుచుల కళ్ళల్లో ఆనందం నింపి మోదీ కారణ జన్ముడయ్యాడని పేర్కొన్నారు.ఆయన చేస్తున్న మంచి కార్యక్రమాలు అనుకున్న స్థాయిలో మధ్యతరగతి, ప్రజలు,రైతులు,యువత కు చేరువ కాలేదని,వికసిత్ భారత్ అనుకున్న స్థాయిలో ప్రజల్లోకి చేరువ కాలేదని, పూర్తిస్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు.మన మతాలను,మన దేవాలయాలను కాపాడుకుంటూ,ఇతర మతాలను గౌరవిస్తున్న వ్యక్తి మోదీ అన్నారు.దేశ రక్షణ కోసం పనిచేస్తున్న వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని కొనియాడారు.

## మహేష్‌బాబుతో కొనసాగనున్న డాలర్ బిగ్‌బాస్ అనుబంధం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త

ప్రముఖ సినీ నటుడు మహేష్‌బాబుతో డాలర్ బిగ్‌బాస్ బ్రాండ్ అంబాసిడర్‌గా డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తన భాగస్వామ్యాన్ని కొనసాగించనుంది.దక్షి ణాది మార్కెట్‌కు సంబంధించి మహేష్‌బాబుతో ఒప్పందాన్ని పొడిగించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ గుప్తా తెలిపారు.దక్షి ణాది మార్కెట్లోకి 2024లో డాలర్ ఉత్పత్తులను ప్రవేశపెట్టామని, వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించిందని పేర్కొన్నారు. మహేష్‌బాబుతో ఏర్పడిన అనుబంధం బ్రాండ్‌కు ఉపయోగపడిందని,అందుకే భాగస్వామ్యాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మహేష్‌బాబుతో సరికొత్త టెలివిజన్ వాణిజ్య ప్రకటనను చిత్రీకరించనున్నట్లు వెల్లడించారు. దక్షి ణాది మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందిస్తున్న ఈ ప్రకటనలో మహేష్‌బాబు ప్రత్యేక లుక్‌లో కనిపించనున్నారని తెలిపారు.డాలర్ ఇండస్ట్రీస్ దేశీయ హోసియరీ, ఇన్నర్‌వేర్ రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా విస్తృత

# శ్రీకాళహస్తి డివిజన్

## వినాయకుని లడ్డు కోసం పోటాపోటీ

### -రూ.1.75లక్షలు పలికిన గంగల పూడి లడ్డు



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం గంగల పూడి గ్రామంలో వినాయకుని లడ్డు కోసం యువకులు పోటీలు పడ్డారు. వేలం పాటలు నిర్వహించుకున్నారు. పోటాపోటీగా వేలం పాటల్లో పాల్గొని పాడుకున్నారు. చివరకు రూ.1,75,218లు చెల్లించారు. శ్రీకాళహస్తి మండలం గంగల పూడి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా లడ్డు ప్రసాదాన్ని తయారు చేసారు. గురువారం ఈ ప్రసాదానికి యువకులు పోటీ పడ్డారు. చివరకు రాసినేని వెంకటరావు కుమారులు రాసినేని అనిల్, రాజులు అత్యధిక వేలం పాటలు పాడుకున్నారు. వేలం మొత్తాన్ని కమిటి నిర్వాహకులకు చెల్లించారు. ఈ సందర్భంగా వినాయకుని ఊరేగించారు. లడ్డు ప్రసాదాన్ని కూడా ఊరేగించారు.

## విద్యారంగ సమస్యలపై...ఉద్యమించాలి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యార్థి నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం శ్రీకాళహస్తి పీ డీ ఎస్ యూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పీడీఎస్‌యూ నిర్మాత కామ్రేడ్ జార్జిరెడ్డి జన్మించిన జిల్లాలో 2026 డిసెంబర్ 11,12,13 తేదీలలో 24వ రాష్ట్ర మహాసభలు జరుగుతు న్నాయని ఈ మహాసభలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయం వరకు విద్యా వ్యవస్థను నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విధ్వంసం చేసింది. 2022 గణాకాల ప్రకారం దేశవ్యాప్తంగా తొమ్మిది లక్షల 79 వేల ఉద్యోగాలు ఖాళీ ఉంటే వాటిని భర్తీకి పూనుకోలేదు. నీట్ పేపర్ లీకేజీ వలన 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలుకు పాల్పడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మహర్షి జిల్లా అధ్యక్షులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## దృఢ నాయకత్వం మోదీ, బాబు లకే సాధ్యం!..



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: అయిదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో సాహసోపేతమైన, కఠినమైన నిర్ణయాలు తీసుకుంటూ భారతదేశ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్న దృఢమైన నాయకత్వం సంస్కరణ వాదులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వయానికే సాధ్యం అని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శియం.ఉమేష్ రావు కొనియాడారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా కీర్తి గడించిన భారతదేశ రాజకీయ చరిత్రలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, అత్యధిక కాలం ప్రధానమంత్రిగా, ఇరవై ఐదు సంవత్సరాలుగా అటు ముఖ్యమంత్రిగా, ఇటు ప్రధానిగా సేవలందిస్తున్న నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా సంకల్ప అభియాన్ పేరిట ఒక నెలరోజుల పాటు నిర్వహించే వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, సుబ్బయ్య, డా.యం.ఉమేష్ రావు, వజ్రం కిషోర్, మునిరాజా యాదవ్, బిజెపి నాయకులు అమర్ నాథ్, లోకేష్ యాదవ్, హరీష్ రెడ్డి, నాగరాజు, జనసేన నాయకులు సతీష్, దుమ్ము రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని గాంధీ వీధి కావమ్మ గుడి వద్ద వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బియ్యపు ఆకర్షరెడ్డి హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకర్ష రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన గణపతి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు స్వయంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆవులపాటి శ్రీనివాసులు, జీవ, మున్నా రాయల్, వాసుదేవ్, జగదీష్, శరవణ, బాలాజీ, వెంకీ, కార్తీక్, ఋషి, రాఘవ, పవన్, ముని కుమార్, మురళి, కుమార్, తేజ, ఆకాష్, భువన, స్టీఫెన్, కలం, గోవా, అరుణ్, అభి, నాని తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



నిండ్ర, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. గురువారం మండలంలోని నెట్టేరి గ్రామపంచాయితీలో రు.36లక్షల రుపాయిలతో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ భారత వైద్యశాలను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంబించినారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వైద్య సేవలు అందించడానికి కోట్లు రుపాయిలు ఖర్చు పెట్టడానికి ముందకు వస్తున్నరని అన్నారు. ముఖ్యమంత్రి చోరవతో నగరి నియోజకవర్గం అన్ని విధాలుగా అబివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యంపిపి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి, మాజీ శ్రీశైలం ట్రస్టు బోర్డు చేర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, నాయకులు బాబుయాదవ్, రవినాయుడు, యంపిడిఓ శివప్రసాద్, తహాశీల్దారు ఈశ్వర్, పంచాయితీరాజ్ ఎఇ వీరభద్రం, రాష్ట్ర యస్‌సి ఉపాధ్యక్షులు ధశరధ వాసు, వెంకటేశులు నాయుడు, పరదేశి, విజయ్‌కుమార్, క్రిష్ణయ్య, జగన్, రమేష్, సంపూర్ణమ్మ, వెంకటరత్నం నాయుడు తదితరులు పాల్గోన్నారు.

## రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం



విజయపురం, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: మండలంలోని సూరికాపురం గ్రామంలో ఆగ్రామస్తులు శ్రీ రాధారుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం బ్రాహ్మణులతో వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞ హోమాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానికులు మదన్ గోపాల్ రాజు, గజేంద్రనాయుడు, సుధాకర్‌నాయుడు, బాలాజీ, రవినాయుడు, సుధాకర్‌నాయుడు, డిల్లీ బాబు, వెంకటేష్ నాయుడు, మధు నాయుడు, గోపినాయుడు, సుదర్శన్‌నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## కోలా సారధ్య...రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో భారత ప్రధాని నరేంద్రమోదీ 76వ జన్మదిన సందర్భంగా గురువారం రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ప్రతి ఏడాది రక్తదాన శిబిరాన్ని యువకుల సారథ్యంలో నిర్వహిస్తున్నారు. ఉదయం రక్తదాన శిబిరాన్ని కోలా ఆనంద్ రక్తదానంతో ప్రారంభించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆనంద్ మాట్లాడుతూ 12సంవత్సరాలుగా ప్రదాని ఒక్క రోజు కూడా సెలవు లేకుండా దేశానికి ఓ సైనికునిలా పని చేస్తున్న యువకుడు నరేంద్రమోదీ అన్నారు. 2047లో వికసిత్ భారత్‌ను ప్రపంచంలో అగ్రగామిగా నిలుపుటకు ఆయన చేస్తున్న కృషి ఆమోఘమన్నారు. ఆపదలో ఉన్న వారిని కాపాడుకోవటానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఆనంద్ పిలుపు నిచ్చారు. నేడు 200 మంది రక్త దానం చేయటం యువతలో సేవా భావానికి నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు రక్తదానాన్ని అందించారు, వారిని కోలా ఆనంద్ అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు బిజెపి నాయకులు కండ్రిగ ఉమ, మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, చంద్రప్ప, కూనాటి నాగరాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞశ్రీ, మండల అధ్యక్షులు రాఘవనాయుడుకు వ్పం హరీష్ రెడ్డి, పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, వేదం కృష్ణయ్య, భాగితి వెంకటేష్, తిరుమలశెట్టి నరేష్, కూటమి సీనియర్ నేతలు మాసరపు సుబ్బయ్య, మోరీ ఉమేష్, మద్దు మునిరాజ, దూమ్ము రాయల్, వజ్రం కిషోర్, జీవి అమర్నాథ్, లోకేష్ యాదవ్, గరికపాటి రమేష్, సొట్ట సుకుమార్, కోనేటి అయ్యప్ప, హుకీమ్ సింగ్, వాసు యాదవ్, గాధిపాకుల యతీష్, భరత్ నాయుడు, ధర్మయ్య, ఫ్లెక్సీ కృష్ణా రెడ్డి, గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బయ్య, కుమార్ నాయుడు, చోటు, కుర్రకాల్వ వేణు, రవి అచ్చారి, భాస్కర్, తులసి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని విశ్వబ్రాహ్మణ సమాజంచే విశ్వకర్మ జయంతి సందర్భంగా గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఊరేగింపు పిచ్చాటూరు రోడ్డులోని ఆలయం నుంచి ప్రారంభించారు. ఊరేగింపును బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్యానాయుడు, గుమ్మడి దశరధాచ్చారి, జయచంద్రనాయుడు, కోలా విశాలాక్షి తదితరులు హాజరు కాగా గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సారథ్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యక్షుడు మోహనాచారి, ప్రధాన కార్యదర్శి చంద్రాచారి, కోశాధికారి కిశోర్, గోపి ఆచారి, రమేషాచారి, శివకుమార్ ఆచారి, గురవయ్యాచారి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు బి.రేణుకమ్మ, బి.వెంకయ్యాచారి తదితరులు పాల్గొన్నారు. ఊరేగింపు పాతవరదయ్యపాళెం రోడ్డు, జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా సాగింది.

## లోక కళ్యాణార్థం గణపతి హోమం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: పట్టణంలోని కావమ్మ గుడివీధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద గురువారం భక్తి శ్రద్దలతో 'హోమాలు' ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు చవితి ఉత్సవాల నిర్వహణ కమిటి స్వాగతం పలికారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో పండగలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ ఉత్సవాల్లో ఆయనతో పాటు ఆవులపాటి శ్రీనివాసులు, వెంకీ, ఆకాష్, కాట్రపల్లి చంద్రశేఖర్‌రావు, మెగరాల గణేష్,, యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. హోమాల అనంతరం ముఖ్యఅతిధి అంజూరు తారక శ్రీనివాసులును దుశ్శాలువతో సత్కరించి ప్రసాదాలు అందించారు.

## శివయ్యసేవలో లోక్‌సభ ఎంపి రవీంద్ర



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయు లింగేశ్వరుని గురువారం లోక్‌సభ సభ్యుడు రవీంద్ర నారాయణ్‌బెహరా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ శేఖర్‌రెడ్డి దర్శించు కున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎపిఆర్‌ఓ రవిల సారథ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనం అనంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ పార్టీ సంబరాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: రాజస్థాన్ రాష్ట్రం నందుస్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో మునుపెనడులేని విధంగా 3613 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిందని డిసిసి అధ్యక్షులు బాలగురవంబాబు, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజస్థాన్ నందు బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రజలు కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో దేశంలో విజయం సాధించిందన్నారు. తలపా దామోదరం మాట్లాడుతూ 34.24 శాతం ఓట్లు సాధించడం కాంగ్రెస్‌పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందనడంలో ఇదొక సూచిక అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, మండల అధ్యక్షులు సురేంద్రంరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రేమసుందరం, సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



శ్రీకాళహస్తి సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: పట్టణంలో విశ్వబ్రహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిచ్చాటూరురోడ్డులో వెలసిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి విగ్రహానికి వివిధ రకాల సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి దివ్యాలంకారాలు చేశారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలతో అలంకరించి విశిష్ట పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి ముఖ్యఅతిధిగా విచ్చేశారు. అనంతరం ఆయన చేతులమీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాదాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవఅధ్యక్షులు వెంకయ్య, టిడిపి మహిళ నాయకురాలు రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో తణుకు ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: తణుకు శాసనసభ్యుడు అరిమిల్లి రాధాకృష్ణ కుటుంబసమేతంగా గురువారం వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓ లోకేష్‌రెడ్డి, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించే మహిమాన్విత పూజలను జరిపించుకున్న వారికి స్వామి అమ్మవార్ల ఆలయ అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శన ఏర్పాట్లను ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి వారి సహచరులు పర్యవేక్షించారు.

## రాస్ సారధ్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: ముత్యాలమ్మగుడివీధిలోని రాస్ మహిళా పొదుపు సంఘాల భవనంలో గురువారం మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తిరుపతిలోని డిఎన్‌ఆర్ మల్టి సూపర్ స్పెషాలిటీస్‌చే వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు సేవలందించారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ఆరోగ్య రీత్యా వైద్యపరీక్షలు నిర్వహించినట్లు పొదుపు సంఘాల ప్రాజెక్టు ఆఫీసర్ కరుణాకర్‌నాయుడు వివరించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాన్ని ప్రారంభిస్తూ మహిళలనుద్దేశించి మట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వారి ఆరోగ్యాన్ని కూడా పరిగణలోకి తీసుకొని వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాస్ సేవలు సభ్యులకు మాత్రమే కాకుండా వారి కుటుంబసభ్యులకు కూడా వర్తించేటట్లు చేస్తున్నామని వివరించారు. ఈ వైద్యశిబిరంలో 120 మందికి వవైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షలను డిఎన్‌ఆర్ ఆసుపత్రి వైద్యబృందం డాక్టర్ తేజోరావు, స్వప్న, సునంద, అనుష్క, సురేష్, యుగంధర్‌లు నిర్వహించారు. ఏర్పాట్లను పొదుపు సంఘాల ప్రాజెక్టు ఆఫీసర్ కరుణాకర్ నాయుడు పర్యవేక్షణలో ఫీల్డ్ అధికారులు ముకేశ్, వినోద్, జయలలిత, ప్రశాంతి, మునిశేఖర్, క్లస్టర్ లీడర్లు హేమలత, మహేంద్ర, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మపాలెంలో గణేష్ లడ్డూ వేలం రు.1,12,000



శ్రీకాళహస్తి రూరల్ సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: మండలంలోని అమ్మపాలెం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం ఉత్సాహంగా జరిగింది. ఈ వేలంలో శ్రీకాళహస్తి మండలం, తిరుపతి జిల్లాకు చెందిన స్వర్గీయ కందాటి సిద్ధారెడ్డి కుమారుడు కందాటి సిద్ధార్థ్‌రెడ్డి రూ.1,12,000లకు గణేష్ లడ్డూను దక్కించుకున్నారు. గ్రామంలో ఇప్పటివరకు నిర్వహించిన లడ్డూ వేలాల్లో ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఈ రికార్డు ధరతో భక్తుల్లో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమం విజయవంతం కావడంలో గ్రామ యువత కీలక పాత్ర పోషించింది. వేలం ఏర్పాట్లు, భద్రత, ప్రచారం వంటి బాధ్యతలను యువకులు ఉత్సాహంగా నిర్వహించారు. యువత ఐక్యత, సేవాభావంతో కార్యక్రమం మరింత ఘనంగా జరిగిందని గ్రామస్థులు ప్రశంసించారు.

## మాజీ సర్పంచ్ ధర్మయ్య కన్నుమూత



తొట్టంబేడు, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: మండలంలోని లింగమ నాయుడుపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు కొప్పల ధర్మయ్య గురువారం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు 15 ఏళ్ల పాటు సర్పంచ్‌గా సేవలందించిన ధర్మయ్య గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయన మృతి పట్ల రాజకీయ శ్రేణులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు రాజకీయ ప్రముఖులు, కూటమి నాయకులు ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## హాస్టల్ గదిలో విద్యార్థి ఆత్మహత్య!

రేణిగుంట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిచ్చాటూరు గ్రామానికి చెందిన కె. పవన్ కళ్యాణ్ (16) ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎం.పి.సి. చదువుతున్నాడు. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న పవన్ కళ్యాణ్ హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక మనస్తాపానికి గురై గదిలో ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో ఈ విషయాన్ని గమనించిన కళాశాల యాజమాన్యం వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించింది. అయితే అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పే స్కేల్, ప్రమోషన్ల కోసం వీఆర్‌ఏల నిరసన



సత్యవేడు, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: సత్యవేడు మండలం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ స్థాయిలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ ఎన్నో సంవత్సరాలుగా విధులను బాధ్యతగా నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్‌ఏ) పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సత్యవేడు మండలంలో ఏపీ వీఆర్‌ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ వీఆర్‌ఏల ఆధ్వర్యంలో సహకార నిరాకరణ ఉద్యమం(సమ్మె) ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమావేశమై తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై నిరసన చేపట్టారు. కార్యక్రమంలోవీఆర్‌ఏలు చిరంజీవి, గోవిందసామి, అలాగేషన్, మోనికా, అనురాధ, విజయన, ఏసురాజు, బాషా, లత, మధుసూదన్, సుధాకర్, జార్జ్, రామయ్య పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడికి నిరసన!

సత్యవేడు, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: సత్యవేడు మండల కేంద్రంలోని జూనియర్‌సివిల్ జడ్జి కోర్టులో విధులు నిర్వహిస్తున్న ఓ న్యాయవాదిపై మంగళవారం జరిగినదాడిని పురస్కరించుకుని న్యాయవాదులు విధుల బహిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సత్యవేడు న్యాయవాదుల బార్‌అసోసియేషన్ సెక్రటరీ రాజా మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. ఈ నేపథ్యంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ తరపున న్యాయమూర్తి ఏ.వెంకట నాగరాజుకు విధుల బహిష్కరణకు సంబంధించి వినతిపత్రం సమర్పించారు. విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో న్యాయవాది జాన్‌పై దాడి చేసినవ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని నినాదించారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షురాలు గీత, ట్రెజరర్ కుబేరన్, సీనియర్ న్యాయవాదులు డి.వెంకటేశ్వరులు, లోకేశ్వరులు, డి.ఎం.ఎస్.రాజు, పలువురు జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## పాదచారుడుని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

### - కోమాలోకి వెళ్లిన బాధితుడు



తిరుపతి క్రైం, సెప్టెంబర్ 17ప్రభాతవార్త : పాదాచారిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై కోమలోకి వెళ్లిన ఘటన అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కరకబాడీలో చోటుచేసుకుంది. అలిపి పోలీసుల సమాచారం మేరకు తిమ్మనాయుడుపాలెం గ్రామానికి చెందిన నరసింహులు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. బుధవారం రాత్రి కరకంబాడి రోడ్డులో నడక మార్గంలో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం అతనిని ఢీకొట్టి పరారయ్యాడు. అనంతరం బాధితుడిని స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాధితుడు కోమాలోకి వెల్లాడు. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.